పాఠశాలల్లో పీటీఎంలు

- ప్రతీనెల మూడో శనివారం సమావేశం
- తరగతుల వారీగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిర్వహణ
- వ్యవసాయ పనులతో తగ్గుతున్న పోషకుల హాజరు



మామడ మండలం దిమ్మదుర్తి ప్రాథమిక పాఠశాలలో సమావేశం (ఫైల్)

మామడ: ప్రభుత్వ పాఠశాలలను మరింత బ లోపేతం చేయాలనే ఉద్దేశంతో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లు పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాయి. వీటితోపాటు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రతి పాఠశాలలో నూతనంగా పీటీఎం(పేరెంట్స్ టీచర్స్ మేనేజ్‌మెంట్ కమిటీ) సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతినెల మూడో శనివారం ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తరగతుల వారీగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను తెలుసుకుంటున్నారు.

జిల్లాలోని పాఠశాలల వివరాలు..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 735 ఉండగా, కేజీబీవీలు 18, గురుకుల పాఠశాలలు 79 ఉన్నాయి. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే పీటీఎం సమావేశం గురించి ముందుగానే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాచారం అందిస్తారు.

చర్చించే అంశాలివీ..

ఈ సమావేశంలో విద్యార్థుల ప్రవేశాలు, హాజరు శాతం పెంపుపై సూచనలు, సలహాలు తీసుకుంటారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వసతులు, తల్లిదండ్రులకు తెలిపి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాముల్ని చేస్తారు.. విద్యార్థుల ప్రగతి కోసం ఉపాధ్యాయులు చేపడుతున్న నూతన కార్యక్రమాలను వివరిస్తున్నారు.

నేటి సమావేశంలో..

- ఈనెల 20న ఏడో పీటీఎం సమావేశంలో పోషకులకు లింగసమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలిక దినోత్సవంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.
- పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయులు వివరిస్తారు.

మధ్యాహ్న భోజన మెనూ అమలుతోపాటు ప్రధానోపాధ్యాయుని పర్యవేక్షణలో తరగతి ఉపాధ్యాయుడు విద్యార్థుల తల్లిదండ్రులతో పీటీఎం నిర్వహించి ప్రగతి వివరిస్తారు. ప్రస్తుతం యాసంగి వ్యవసాయ పనుల సమయం కావడంతో పీటీఎం సమావేశానికి పోషకుల హాజరు తక్కువగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

హాజరు పెరిగింది



నెలలో మూడో శనివారం మా పాఠశాలలో పీ టీఎం స మావేశం నిర్వహిస్తున్నాం. వారి తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల ప్రగతి వివరిస్తాం. ఈ సమావేశాలతో విద్యార్థుల హాజరు పెరిగింది. కానీ పోషకులు తక్కువ వస్తున్నారు.

– రాంచందర్, హెచ్ఎం, జెడ్పీఎస్ఎస్ పెంబి

విద్యార్థుల ప్రగతి తెలుస్తుంది



పీటీఎం సమావేశాలకు వెళ్లడం ద్వారా విద్యార్థి విద్యా ప్రగతి తెలుస్తుంది. వారేం చదువుతున్నారో.. ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడుతున్నారో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం పనుల కారణంగా తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో రాలేకపోతున్నారు.

– గంగారెడ్డి, పోషకుడు, జెడ్పీఎస్ఎస్ పొన్కల్

ప్రత్యేక అంశంపై అవగాహన

ప్రతినెల మూడో శనివారం పీటీఎం సమావేశాలకు పోషకులు హాజరవడం ద్వారా పాఠశాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యం పెరుగుతుంది. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతి గురించి పోషకులకు వివరిస్తారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతారు. ప్రతి సమావేశంలో ప్రత్యేక అంశంపై అవగాహన కల్పిస్తారు.

–ప్రవీణ్‌కుమార్, సెక్టోరియల్ అధికారి

కేంద్రం నిధులతోనే అభివృద్ధి

- నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దిలావర్‌పూర్: కేంద్రప్రభుత్వం అందించే నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని న్యూలోలం గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానని పేర్కొన్నారు. గ్రామంలో అవసరమైన చోట డ్రెయినేజీ, సీసీ రోడ్లను నిర్మించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, సర్పంచ్ ఒడ్నం సవిత, ఉపసర్పంచ్ నరేందర్, ఎంపీపీ అక్షర అనిల్, జెడ్పీటీసీ సభ్యుడు తక్కల రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఏలేటి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ డి.సరిత, పంచాయతీరాజ్ డీఈ తుకారాం, ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ అజీజ్‌ఖాన్,సిర్గాపూర్ సర్పంచ్ గంగారెడ్డి, బీజేపీ నాయకులు భూమయ్య పాల్గొన్నారు.

21న టీజేఎస్ సదస్సు జయప్రదం చేయండి



ఖానాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను కేంద్రప్రభుత్వం అమలు చేయాలనే డిమాండ్ టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో ఈనెల 21న హైదరాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సంఘ భవనంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు అన్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో శుక్రవారం టీజేఎస్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి రాష్ట్ర సంస్థలు, ఆస్తులను విభజించాలని కోరారు. సమావేశంలో మల్లారెడ్డి, బెనహర్, శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, ప్రవీణ్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం వద్ద శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. అలీంఖాన్, తులసిరాం, విలాస్, విశ్వనాథ్, సతీశ్, లక్ష్మణ్ పవార్, అశోక్, శ్రీనివాస్, పాష తదితరులున్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



ఏబీవీపీ నాయకులతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ హాజరై ప్రారంభించారు. ఏబీవీపీ నగర అధ్యక్షుడు నవీన్, చంద్రగిరి శివకుమార్, శశి, సాయినాథ్, రఘు, శశాంక్ తదితరులు ఉన్నారు.

పన్ను చెల్లించని దుకాణానికి తాళం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఈద్‌గాంలోని ఓ దుకాణానికి ఆస్తి పన్ను చెల్లించలేదని మున్సిపల్ అధికారులు శుక్రవారం తాళం వేశారు. సదరు యజమాని రూ.1,26,000 ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తాళం వేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇందులో రెవెన్యూ అధికారి గంగాధర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

21న సమావేశం

లోకేశ్వరం: ఈనెల 21న ఖానాపూర్ పీఆర్టీయూ భవనంలో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పుస్పూర్‌లో మాట్లాడారు. కార్మికులు తరలిరావాలని.. వ్యవసాయ, ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, పోడు పట్టాల పంపిణీపై చర్చిస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు మురళీమోహన్, ముత్తన్న, ప్రసాద్ ఉన్నారు.

ఈరోజు

ఓటరు నమోదు కార్యక్రమం

కుంటాల: మండలంలోని గ్రామాల్లో శని, ఆది వారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు బీఎల్‌ఓల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

పసుపు పంటపై శిక్షణ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఉదయం 10 గంటలకు పసుపు పంటపై లోకేశ్వరం మహిళా ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధి రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పసుపు రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఖానాపూర్‌లో 2కే రన్

ఖానాపూర్: ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు శనివారం ఖానాపూర్‌లో 2కే రన్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పరిమళ్ భౌమిక్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా ఐబీ వరకు జరిగే 2కే రన్‌లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే పర్యటన

భైంసా: బాసర మండలం కౌట గ్రామంలో శనివారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పర్యటిస్తారని సర్పంచ్ మధుపటేల్ ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల అదనపు తరగతి గదులు, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

విశ్రాంత ఇంజినీర్ల డైరీ ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయ ఆవరణలో విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఇంజినీర్ల సంఘం–2024 డైరీని శుక్రవారం విశ్రాంత చీఫ్ ఇంజినీర్ ఆనంద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కామారపు జగదీశ్వర్ అధ్యక్షత వహించారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ నగేశ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జగదీశ్వర్‌రెడ్డి, వెంకటపతి, డిప్యూటీ ఈఈలు రాజారెడ్డి, గంగాధర్, లక్ష్మినర్సయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

తానూరు: మండలంలోని ఎల్విలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ పరిశీలించారు. నర్సరీలో మొక్కలకు నీటిని అందించి ఎండిపోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించి చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటిలో దీపం వెలిగించాలి

లోకేశ్వరం: ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఈనెల 22న ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించాలని కిష్టాబాయి గన్యా నాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ నాయకులు జాదవ్ రాజేశ్‌బాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో లక్ష కాషాయ జెండాలు, ప్రమిదలు, వత్తులు, డోర్‌ప్రతులు, రామమందిరం చరిత్ర తెలిపే జాగృతి పుస్తకాలను ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ఆవిష్కరించారు. సుమన్‌కుమార్, చిన్నారావు, శ్రీధర్, రమేశ్, మంద భాస్కర్, సరస్వతి, జీవన్, జయసాగర్‌రావు, దింగబర్, సాయికుమార్ ఉన్నారు.

విరాళం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ లో ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం కోసం భూమి కొనుగోలుకు కాలనీకే చెందిన దాతలు శుక్రవారం రూ.22వేల విరాళం అందజేశారు. అల్లాడి శోభారాణివేణుగోపాల్ రూ.11వేలు, అల్లాడి సింధూవినోద్‌లు రూ.11వేలు చొప్పున విరాళం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు సతీశ్‌రావు దేశ్‌పాండే, అయిందాల జనార్దన్ తెలిపారు.

మహారాణా ప్రతాప్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలో రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో మహారాణా ప్రతాప్ 427వ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్‌పై ఉన్న మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ సింగ్, గౌరవాధ్యక్షులు గజేందర్‌సింగ్, సభ్యులు సాయిసింగ్, సుశీల్‌సింగ్, ఆనంద్‌సింగ్, రోహిత్‌సింగ్, మిథున్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కడెం తహసీల్దార్‌గా సుజాత



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కడెం: కడెం నూతన తహసీల్దార్‌గా సుజాత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన రాజేశ్వరి ఏసీబీ దాడుల్లో పట్టుబడిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న సుజాతను తహసీల్దార్‌గా నియమించారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

'అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలి'

కడెం: విధుల్లో నిర్లక్ష్యం వహించే కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దిగంబర్ డిమాండ్ చేశారు. కెమిస్ట్రీ లెక్చరర్ రాజన్న, ఫిజిక్స్ లెక్చరర్ సుధాకర్‌రెడ్డి ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థులకు వేర్వేరుగా కాక ఒకే క్లాస్ తీసుకుంటున్నారని.. దీంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డీఐఈవో పరశురాంకు ఫిర్యాదు చేశారు.

రాములోరి అక్షింతలు పంపిణీ



పాక్‌పట్లలో పంపిణీ చేస్తున్న భక్తులు

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో అయోధ్య రాములోరి అక్షింతలను శుక్రవారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన గుర్రపు రథంలో శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో తరలివచ్చారు. జక్క నర్సయ్య, సుంకరి ముత్యం, అశోక్, రమేశ్, గోపి, జనార్దన్ తదితరులున్నారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను శుక్రవారం అధికారులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ప్రత్యేకాధికారి మసార్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంఈవో ముత్యం, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ ఉన్నారు.

పరిశ్రమల వార్షిక సర్వే

నర్సాపూర్(జి): రాష్ట్ర, దేశీయ జాతీయ ఉత్పత్తి (జీడీపీ) గణన కోసం పరిశ్రమల వార్షిక సర్వేలో భాగంగా మండలం కేంద్రంలోని శ్రీ అనంత ఆగ్రో రైస్ మిల్లును శుక్రవారం మండల గణాంక అధికారి జాదవ్ సాయికృష్ణ పరిశీలించారు. అందులో భాగంగా రైస్‌మిల్లు సంవత్సర ఉత్పత్తి, ఆదాయం, ఆస్తుల వివరాలు నమోదు చేసుకున్నారు. వారి వెంట మిల్లు మేనేజర్ రాజారెడ్డి ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లోకేశ్వరం: మండల కేంద్రంలో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... గాదేపల్లి లక్ష్మి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం రాత్రి తాళం పగులగొట్టి ఇంటి బీరువాలోని రూ.15వేల నగదును ఎత్తుకెళ్లారు. లక్ష్మి శుక్రవారం ఇంటికి వచ్చే చూసే సరికి నగదు కనిపించలేదు. దీంతో పోలీసుకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంపీవో పరిశీలన

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీవో మోజం హుస్సేన్ రికార్డులను పరిశీలించారు. పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ.. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీవో సిబ్బందికి సూచించారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కను రక్షించాలని పేర్కొన్నారు.

పారిశుధ్య పనులు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలోని బీసీ కాలనీలో శుక్రవారం పంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దగ్గరుండి పనులు పర్యవేక్షించారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళిక

లక్ష్మణచాంద: గ్రామ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు మండలంలోని పొట్టపెల్లి (కె) సర్పంచ్ హైమావతి తెలిపారు. శుక్రవారం గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో 2024–25లో చేపట్టే పనులు చర్చించారు. ఎస్టీ కాలనీలో మురికి కాల్వల నిర్మాణం, ఎస్సీ, బీసీ కాలనీల్లో మురికి కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణం, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టి వైకుంఠధామం వద్ద నీటి వసతికి పైపులైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉపసర్పంచ్ పల్లవి, వార్డు సభ్యులు చిన్నారెడ్డి, అశోక్, వీడీసీ సభ్యులు, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలి

- ఎత్తిపోతల పథకం కింద నీరు ఇచ్చి నిర్వహణకు పన్నులు వసూలు చేయాలి
- లోకేశ్వరం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్‌రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.

ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి.. పేదలకు విద్య, వైద్యానికి లోటు రాకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట వీడీసీ సభ్యులు విద్యావలంటీర్లను నియమించాలన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని ఆంధ్రనగర్ ఎత్తిపోతల పథకం నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించడంతో వారి వద్ద రూ.50 లక్షల నగదు ఉందన్నారు. నియోజకవర్గంలోనూ ఎత్తిపోతల పథకం నుంచి రైతుల భూములకు సాగునీరు అందించి నీటి పన్నులు చేయాలని కమిటీలకు సూచించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరవాలని సూచించారు.

పిప్రి ఎత్తిపోతల పథకానికి రూ.30 కోట్లు మంజూరు చేయించి పనులు పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని గడ్‌చాంద సర్పంచ్ వెంకట్‌రావు పేర్కొనగా.. విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఎమ్మెల్యే ఎంఈవో చంద్రకాంత్‌కు సూచించారు. శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, తహసీల్దార్ మోతీరాం, భగీరథ డీఈ ఆదిత్య, ఎంపీడీవో సోలమాన్ రాజ్, ఏఈలు శివకుమార్, రఘువంశీ, శ్రీకాంత్, ఏవో గణేశ్, పశువైద్యాధికారి జెస్సీ తదితరులున్నారు.

ఇసుక అక్రమ దందాపై కొరడా

- గ్రామాల్లోని ఇసుక డంప్‌లను సీజ్ చేసిన అధికారులు



సీజ్ చేసిన డంప్‌ల వద్ద అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఖానాపూర్: ఖానాపూర్, పెంబి మండలాల్లో వాగులు, వంకల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక దందాపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఈ విషయమై ఈనెల 15న సాక్షిలో 'వాగుల్లో ఇసుక తోడేళ్లు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా, మండల అధికారులు తరలివచ్చారు. శుక్రవారం ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్, కొలాంగూడతోపాటు పాతఎల్లాపూర్ గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 102 ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను అధికారులు సీజ్ చేశారు. ఖానాపూర్ తహసీల్దార్ పరిమళ్ భౌమిక్, ఎస్సై లింబాద్రిలతో పాటు మైనింగ్‌శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పెద్ద ఎత్తున ఇసుక డంప్‌లను గుర్తించారు. సీజ్ చేసిన ఇసుకను కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామని పేర్కొన్నారు. అధికారుల వెంట ఆర్ఐ రాజేశ్వర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న డీఆర్డీఓ విజయలక్ష్మి

మామడ: మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించి ఆరోగ్యవంతమైన సమాజం కోసం తమ వంతు సహకరించాలని డీఆర్డీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని వాస్తాపూర్‌లో గురువారం రాత్రి ఆదివాసీ మహిళలతో సమావేశమయ్యారు. రూరల్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ లైవ్లీహుడ్ అక్టివేషన్ (రేలా) ఆధ్వర్యంలో వారికి నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రేలా శానిటరీ ప్యాడ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గిరిజనులందరూ అందుబాటులో ఉండే సమయంలో అవగాహన కల్పించేందుకు రాత్రిపూట వచ్చినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ల సూచనల మేరకు రేలా పేరిట అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్డీవో పేర్కొన్నారు. ఇందులో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా '50రోజుల పరుగు'



మెడల్స్ అందుకున్న సభ్యులు

నిర్మల్: ఆరోగ్య రక్షణలో భాగంగా ఎప్పుడూ కొత్తగా ప్రయోగాలు చేసే నిర్మల్ సైక్లింగ్ క్లబ్(ఎన్‌సీసీ) ఈసారి 50రోజులపాటు చేపట్టిన పరుగును విజయవంతంగా పూర్తి చేసింది. సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో '50 డేస్ ఆఫ్ రన్నింగ్'పేరిట చేపట్టిన చాలెంజింగ్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. గత 50 రోజులుగా క్లబ్ సభ్యులు రోజూ సైక్లింగ్‌తోపాటు రన్నింగ్ చేశారు. వీరికి జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ ప్రతినిధులు, ప్రముఖ స్విమ్మర్ విక్టోరియా, ఫణి రాజు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో నిర్మల్ సైక్లింగ్ క్లబ్ అధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీఎల్ నరసింహారెడ్డి, ప్రతినిధులు డాక్టర్ రఘునందన్‌రెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ కృష్ణస్వామి, డాక్టర్ కావేటి శ్రీకాంత్, కాసం రాజ్‌కుమార్, సీఏ సాయిప్రసాద్, శ్రీరామ్‌రాజు, శరత్‌రెడ్డి, సాయినందన్, ప్రీతమ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు' కోసం అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న దీక్షలో కళాకారుడు శంకర్

భైంసాటౌన్: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కొనసాగించాలని భైంసా పట్టణానికి చెందిన కళాకారుడు కొత్తూరు శంకర్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం అర్ధనగ్నంగా బైఠాయించి నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దళితబంధు పథకానికి నియోజకవర్గంలో 1,100 మంది లబ్ధిదారులను గుర్తించి నిధులు విడుదల చేసిందన్నారు. కానీ ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని తెలిపాడు. వెంటనే లబ్ధిదారులకు డబ్బులు అందించాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. జనసేన నాయకులు సుంకెట మహేశ్, దళితులు మద్దతు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

కుంటాల: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో కీలకమని ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. ఓటరు నమోదులో భాగంగా శుక్రవారం కుంటాలలో 2కే రన్ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో నిర్భయంగా ఓటు వేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. మండల ప్రత్యేకాధికారి మసార్‌రావు, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంఈవో ముత్యం, ఎస్సై హన్మాండ్లు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్, వైస్ ఎంపీపీ మౌనిక, సర్పంచ్ సమత పాల్గొన్నారు.